మి నీ క థ

# నాకూ ఓ మనసున్నాది

పదిహేడేళ్ళ సత్తిగాడి కళ్ళల్లో ఎర్రటి జీరలున్నాయ్—అవి వాడి గుండెల్లో అల్లరిచేస్తున్న కోర్కెకు సంబంధించినవి, ఆ కోర్కెలో విహరిస్తున్నది సుబ్బులు

*  *  *

సుబ్బులుకి గ్లామరుంది గ్లామర్ని అమ్ముకునే ధైర్యం వుంది, అవసరం కూడా వుంది ఆమె ఒంటి పంపులమీద వాత లున్నాయి ఆ వాతలకీ, పోలీసోళ్ళ లారీలకి చుట్టరికం వుంది

సత్తిగాడికి వాళ్ళమ్మెవరో తెలీదు వాడి నాన్నెక్కడున్నాడో, వాడికే కాదు, వాళ్ళమ్మకి కూడా తెలీదు సత్తిగాణ్ని అందరూ ఇంగ్లీషులో 'బ్రోకర'ని పిలుస్తారు ఇంగ్లీషు మాటలు నోరుతిరక్క, మరే కారణం చేతో 'సత్తెం' అని ఆప్యాయంగా పిలుస్తుంది సుబ్బులు అలా పిలిచి తను తిన్నా, తినకపోయినా వాడి కింత తిండి పెడుతుంది

బయట, సుబ్బులు పాక చూరు క్రింద రాత్రిళ్ళు గడిపే సత్తిగాడికి, లోపల గుసగుసలూ, కిసకిసలూ, పకపకలూ మొన్నమొన్నటి వరకూ చిరాకుని కలిగించేవి ఈ మధ్య వాడిని కదిలించటం ప్రారంభించాయి సత్తిగాడికి సుబ్బులు మీద కోర్కె, ఎదుగుతున్న వాడి యవ్వనంలా పెరిగిపోయింది

*  *  *

తన కోర్కె బైట పెడితే సుబ్బు లేమంటుందోనని క్షణంలో సగంసేపు ఆలోచించాడు "అదేమీ పతివ్రత కాదు కనీసం సంసారన్నా కాదు " కానీ అడగాలంటే ఎందుకో భయమనిపించింది స తిగాడికి

వాడి భయాన్ని కోర్కె మింగేసింది. దేశాన్ని అప్పుడే చీకటి మింగబోతోంది తడబడుతున్న కాళ్లతో, దడదడలాడుతున్న గుండెల్తో సుబ్బులు దగ్గరగా వెళ్ళేడు "నువ్వు కావాలే" అన్న వాడి మాటల్ని పూర్తి చెయ్యనివ్వలేదు సుబ్బులు

"నా కిట్టంలేదు" అంది

సత్తిగాడు నవ్వేడు, "నీకూ ఇట్టా ఇట్టాలేందే పతివ్రాత నను కుంట న్నావా" సుబ్బులు బుజాల్ని పట్టుకున్నాడు గట్టిగా, "నేను కూడా డబ్బిత్తానే "

సత్తిగాడి చెంప పగిలిపోయింది

సుబ్బులు అరచేయి కందిపోయింది!!

గొంతు కంపించింది, "రేయ్ నేను పతివ్రాతని కాదురా అట్లాగని సెప్పి నా కిట్టంలేని పని సెయ్యను 'సానిది దీనికి ఇట్టాఇట్టాలేంది' అని నవ్వమాక సెప్తున్నా ఇను నాకూ కలలూ. కన్నీళ్ళూ వున్నాయ్‌రా " అంటూ వాణ్ని గుండెల కదుముకుంది శపించాల్సిన నోటితో నుదిటిమీద ముద్దెట్టుకుంది "నేను నీ క్కావల్రా సన్నాసీ నేను నీకు రోజూ అన్నం పెడతన్నాను-నాకు బిడ్డుంటే నీ వయసులో వుండేవోడు లేడు కనక ఆ 'ఇది' తీర్చుకుంటున్నాను "

సుబ్బులు గొంతు పగిలిపోతుందేమో ననిపించింది సత్తిగాడికి

"ఎట్టా సూత్తన్నావ్ అరదం కాలేదా అందుకేనా నాకు డబ్బిత్తానని కూసేవ్ ఒరేయ్ నేను నీకమ్మనురా."

సత్తిగాడు మాట్లాడలేదు!

మాట్లాడితే సుబ్బులు బ్రతకదు!!

— మాడభూషి దివాకర్.